Eenadu Dt 28/06/15



మెట్రోరైల్వే మార్గంపై సభాపతి మధుసూదనాచారి, మండలి అధ్యక్షులు స్వామిగౌడ్‌లకు వివరిస్తున్న ఆ సంస్థ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి. చిత్రంలో ఉపసభాపతి పద్మా దేవేందర్‌రెడ్డి తదితరులు

# శాసనసభ భవనానికి ఇబ్బంది లేకుండా మెట్రో

## సభాపతి, మండలి అధ్యక్షులకు స్పష్టంచేసిన ఎల్‌అండ్‌టీ

ఈనాడు, హైదరాబాద్: శాసనసభ భవనానికి ఏలాంటి ఇబ్బందీ లేకుండా, అన్ని జాగ్రత్తలూ తీసుకొనే మెట్రో మార్గాన్ని నిర్మిస్తున్నామనీ... మారినమార్గంలో త్వరలో పనులు చేపట్టనున్నామని ఎల్ అండ్‌టీ సంస్థ తెలంగాణ శాసన సభాపతి మధుసూదనాచారి, మండలి అధ్యక్షులు స్వామిగౌడ్‌లకు వివరించింది. శనివారమిక్కడ శాసనసభ ఆవరణలోని సభాపతి కార్యాలయంలో మెట్రోమార్గంపై సమీక్ష జరిగింది. దీనికి సభాపతి సిరికొండ మధుసూదనాచారి, మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి, శాసనసభ కార్యదర్శి డాక్టర్ రాజాసదారాం తదితరులు పాల్గొన్నారు. నాంపల్లి నుంచి తెలుగు లలితకళాతోరణం, పబ్లిక్‌గార్డెన్స్ వెనుక నుంచి డీజీపీ కార్యాలయం వరకు మెట్రోమార్గాన్ని మళ్లించడానికి ఉన్న అవకాశాలను మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఎల్ అండ్‌టీ అధికారులు వివరించారు. అక్కడి నుంచి లక్డీకాపూల్ మీదుగా మార్గాన్ని మళ్లించే అవకాశమున్నట్లు చెప్పారు. శాసనసభ వెనుక వైపు నుంచి మెట్రో వెళ్తుందని, మెట్రో మార్గాన్ని నిర్మించడం వల్ల శాసనసభ భవనానికి ఏమైనా ఇబ్బందులుంటాయా? అని సభాపతి, మండలి ఛైర్మన్లు అడిగి తెలుసుకున్నారు. సాంకేతికంగా భూసార పరీక్షలు చేశారా? మెట్రో స్తంభాలను ఎలా వేస్తారు? వంటి ప్రశ్నలు వేసి తెలుసుకున్నట్లు సమాచారం. సాంకేతికంగా అన్నిరకాలుగా పరీక్షలు చేసిన తర్వాతనే పనులు చేపట్టాలని వారు అధికారులకు సూచించారు. సాంకేతిక పరీక్షల తర్వాత మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

Sakshi 28/06/15

# మెట్రోతో అసెంబ్లీ భవనానికి ముప్పు లేదు

- చారిత్రక కట్టడాలకు ఇబ్బంది లేకుండానే అలైన్‌మెంట్
- స్పీకర్‌కు వివరించిన మెట్రో రైలు ఎండీ



**స్పీకర్ మధుసూదనాచారికి అలైన్‌మెంట్ మార్పుపై వివరిస్తున్న మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి. చిత్రంలో స్వామిగౌడ్, పద్మాదేవేందర్‌రెడ్డి**

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ వెనుక వైపు నుంచి చేపట్టనున్న నూతన మెట్రో మార్గంపై హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి స్పీకర్ మధుసూదనాచారికి శనివారం పూర్తి వివరాలు తెలియజేశారు. అలైన్‌మెంట్ మార్పుతో చారిత్రక కట్టడమైన అసెంబ్లీ భవనానికి ఎలాంటి ముప్పు ఉండబోదని, పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. తెలుగు విశ్వవిద్యాలయం వెనుక వైపున ఉన్న రైల్వే మార్గం పక్క నుంచి, అసెంబ్లీ వెనుక నుంచి, ఏపీ డీజీపీ కార్యాలయం, సువిధ, పోలీస్‌క్వార్టర్స్ మీదుగా లక్డీకాపూల్ వైపు మెట్రో మార్గం వెళ్లనుందని తెలిపారు. నగరంలో ఇతర మార్గాల్లోనూ చారిత్రక కట్టడాలకు ముప్పు వాటిల్లకుండానే మెట్రో పనులు చేపట్టాలని శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, స్పీకర్ మధుసూదనాచారి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి అసెంబ్లీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.